క్లుప్తంగా

తైక్వాండో చాంపియన్ కేబీఎన్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల తైక్వాండో చాంపియన్‌గా తమ కళాశాల విద్యార్థి మధు నిలిచాడని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. తమ కళాశాల విద్యార్థి మధు బంగారు పతకం సాధించి కాలేజీ కీర్తిని ఇనుమడింపజేశాడని పేర్కొన్నారు. కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల జరిగిన పోటీల్లో తమ విద్యార్థి బంగారు పతకం సాధించడమే కాకుండా జమ్మూకశ్మీర్‌లో జరిగే ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయ తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి మధును, కళాశాల క్రీడా విభాగాధిపతి హేమచంద్రరావును హిందూ హైస్కూల్ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు అభినందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ధర్మపథంపై నగరానికి చెందిన శ్రీనాట్య అంజలి కూచిపూడి నృత్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు విశేషంగా అలరించింది. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై మంగులూరి త్రినాథాచారి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

దుర్గగుడి ఇంజినీరింగ్ పనులపై సమీక్ష



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతి, భవానీ దీక్షల ఏర్పాట్లపై పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మంగళవారం ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఎమ్మెల్యే సుజనా చౌదరి మంగళవారం దర్శించుకున్నారు. ఆయన ఈవో కె.ఎస్.రామరావు చాంబర్‌లో ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. దుర్గగుడిలో అభివృద్ధి పనులపై దాదాపు గంట పాటు చర్చించారు. భవానీ దీక్ష విరమణలకు విచ్చేసే వారికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈఈ కోటేశ్వరరావు, వైకుంఠరావును ఆదేశించారు.

దేవదాయ శాఖ మంత్రికి ఎన్‌ఎంఆర్‌ల వినతి




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో దీర్ఘకాలంగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్‌ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలని మంగళవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆలయ సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. దుర్గగుడికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎన్‌ఎంఆర్ ఉద్యోగులందరూ కలిసి తమ గోడును చెప్పుకున్నారు. ఎన్‌ఎంఆర్‌లు(బేసిన్‌పే విధానంలో)గా ఎన్నో దశాబ్దాల నుంచి విధులు నిర్వహిస్తున్నామని, గతంలో కొంత మంది ఎన్‌ఎంఆర్‌లు కోర్టు ఉత్తర్వుల ప్రకారం రెగ్యులర్ చేయించుకున్నారన్నారు. తమను రెగ్యులర్ చేయాలని వినవించుకున్నారు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎంఆర్‌లకు సంబంధించి రికార్డులను దేవస్థాన కార్యాలయం నుంచి తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ముందస్తు జాగ్రత్తలపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు పోలీసులు మంగళవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో సాయి సుధా టవర్స్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నవారితో సమావేశం ఏర్పాటు చేశారు. క్రైం డీసీపీ కె.తిరుమలేశ్వరరెడ్డి, క్రైం ఏడీసీపీ ఎం.రాజారావు పర్యవేక్షణలో వెస్ట్ ఏసీపీ దుర్గారావు ఆధ్వర్యంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు వారి సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. దొంగతనాలు ఎలా జరుగుతాయి, నేరాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పోలీస్ కమిషనర్ ప్రవేశపెట్టిన ఈ–పహారా గురించి, డయల్ 100, 112, 1930, ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో ఉపయోగాలపై సీసీఎస్ అధికారులు వారి సిబ్బందితో అవగాహన కల్పించారు.

ధరదడ

కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ధరలు కొండెక్కి కూర్చోవడంతో సామాన్యులకు కూరగాయలు అందుబాటులో లేకుండా ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు కేజీ రూ.80కి తక్కువ కాకుండా ఉన్నాయి. అదే రైతుబజార్‌లో అయితే వంకాయ 58, బెండ 48 ఇలా ధరలు భగ్గుమంటుండంతో కొనలేం.. తినలేమని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





కేదారేశ్వరపేట రైతు బజారు



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): నగరంలో కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు కూరగాయలను కొనలేని పరిస్థితి. గతంలో రెండు వందల రూపాయలు తీసుకుని మార్కెట్‌కు వెళ్తే సంచినిండుగా కావలసినవి తీసుకొచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఐదు వందలు తీసుకెళ్లినా కావలసిన కూరగాయలు తీసుకురాలేని పరిస్థితి.

అందని సబ్సిడీ సరుకులు

ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందిస్తున్నామని చెబుతున్నా కందిపప్పు, నూనె పేదలకు అందని పరిస్థితి. ఏ రైతుబజారుకు వెళ్లినా స్టాక్ లేదు.. రాలేదు అనే సమాధానమేనని వినియోగదారులు చెబుతున్నారు.

కొనలేం

ప్రస్తుతం మార్కెట్‌లో ఏ కూరగాయలు కొనాలన్నా కేజీ వందల్లో ఉండటంతో ప్రజలు తీసుకోలేని పరిస్థితి ఉంది. ఏ కూరగాయ కొనాలన్నా కేజీ రూ.80కి తగ్గకుండా ఉన్నాయి. గ్రేడింగ్ చేసిన కూరగాయలు రైతుబజార్‌కు వస్తున్నాయి. కేదారేశ్వరపేట రైతుబజార్‌లో వంగ రూ.58, బెండ 48, కాకర 46, బీర 45, క్యాలీఫ్లవర్25, గోరు చిక్కుళ్లు50, దోస 40, చిక్కుళ్లు హైబ్రిడ్ 84, పొట్ల రూ.30కి విక్రయిస్తున్నారు. దీంతో వాటిని కొనలేక అర్థాకలితో గడపాల్సి వస్తుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.



రైతు బజారులో కూరగాయలు

నియంత్రణ ఏదీ

కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్, తక్కువ ధరలకే మద్యం అంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం నిత్యావసర ధరలను నియంత్రించి పేద, మధ్య తరగతి ప్రజలకు వాటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పట్టించుకోని పాలకులు

గతంలో తాడేపల్లి, ఉండవల్లి, వడ్డేశ్వరం, పెనమలూరు, నున్న, అగిరిపల్లి తదితర ప్రాంతాలనుంచి ఆకుకూరలు, కూరగాయలు మార్కెట్‌కు వచ్చేవి. ప్రస్తుతం పంట దిగుబడి తగ్గటం పండించే వారు లేకపోవడం, వరదలు, పొలాలను రియల్ ఎస్టేట్ రంగానికి అప్పగించటంతో కూరగాయల దిగుమతి తగ్గిపోయిందని వ్యాపారులు చెప్తున్నారు. ధరల విషయంలో పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

బాబోయ్ కూరగాయలు



రెండు నెలలుగా కూరగాయల ధరలు మండుతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లోనే ధరలు అధికంగా ఉంటే రిటైల్ మార్కెట్‌లో వాటిధరలు మరింతగా మండిస్తున్నాయి. సబ్సిడీ ధరలకు విక్రయించే రైతుబజారుల్లో కూడా కూరగాయలు కొనాలంటే దడపుడుతోందని కొనుగోలుదారులు వాపోతున్నారు.

రూ.500 లేనిదే మార్కెట్‌కు వెళ్లలేం



గతంలో వంద రూపాయలు తీసుకు వెళ్తే కావలసిన కూరగాయలు తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు రూ.500 లేనిదే మార్కెట్‌కు వెళ్లలేక పోతున్నాం. టమాటాలు, పచ్చిమిర్చి, ఆకుకూరలు తెచ్చుకొలేని పరిస్థితి ఉంది.

–కొండారెడ్డి, వినియోగదారుడు

ధరల బాదుడు



కూరగాయలు ఒక పక్క మంట పుట్టిస్తుంటే మరోవైపు నూనెల ధరలు అందనంత ఎత్తులో ఉన్నాయి. ఒక పక్క పనులు లేవు మరోవైపు ధరల బాదుడు ఇలా ఉంటే ఎలా బతకాలో తెలియడం లేదు.

–సురేష్, వినియోగదారుడు

ఎప్పుడూ ఇంతటి ధరలు చూడలేదు



ఇన్ని సంవత్సరాల్లో ఇంత ఎక్కువ ధరలను చూడలేదు. అప్పుడప్పుడు ఉల్లిపాయలు, టమాటాలు ధరలు ఎక్కవగా ఉండేవి కానీ ఈ స్థాయిలో అన్ని కూరగాయల ధరలు రూ. 80కి తగ్గకుండా పెరగటం మొదటిసారిగా చూస్తున్నా. ఇలాగే ఉంటే కూరగాయలు కొనలేం.

–జయమ్మ, వినియోగదారులు

మాస్టర్ కాంపిటేషన్‌లో కేఎల్‌రావు స్విమ్మర్ల ప్రతిభ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర స్థాయి మాస్టర్స్ కాంపిటేషన్ స్విమ్మింగ్ పోటీల్లో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌కు చెందిన పలువురు సీనియర్ స్విమ్మర్లు వివిధ కేటగిరిల్లో ప్రతిభ కనబర్చి బహుమతులను సాధించినట్లు కోచ్ ఎస్‌కే రఫీ పేర్కొన్నారు. మంగళవారం కేఎల్‌రావు స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన మాస్టర్ స్విమ్మర్లను కోచ్ రఫీ, కార్పొరేషన్ అధికారులు అభినందించారు. 50–54 ఏళ్ల మహిళల విభాగంలో ఎండీ షమీ ఫ్రీస్టైల్‌లో గోల్డ్ మెడల్, బెస్ట్ స్టోక్ విభాగంలో గోల్డ్ మెడల్, వంద మీటర్ల ఫ్రీస్టైల్ విభాంగలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. 20–24 ఏళ్ల మహిళల విభాగంలో షేక్ అర్షద్ 200 మీటర్లు, 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 25–29 ఏళ్ల విభాగంలో బి.పృధ్వీ 50 మీటర్ల బెస్ట్ స్టోక్స్ విభాగంలో మూడో స్థానంలో నిలిచారు. 35–39 ఏళ్ల విభాగంలో వైవీడీజీ కృష్ణారెడ్డి 400 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో మూడో స్థానంలో, 35–39 ఏళ్ల విభాగంలో వంద మీటర్లు బెస్ట్ స్ట్రోక్ విభాగంలో ఎస్. గణేష్‌కుమార్ మూడో స్థానంలోనూ, 40–44 ఏళ్ల విభాగంలో కె. కిశోర్ 50 మీటర్లు ఫ్రీస్టైల్, బెస్ట్ స్ట్రోక్ విభాగంలో మూడో స్థానాంలో నిలిచారన్నారు. 50–54 ఏళ్ల విభాగంలో ఎల్. శ్రీనివాసరావు 50 మీటర్లు ఫ్రీస్టైల్ విభాగంలో మూడో స్థానంలో, 55–59 ఏళ్ల విభాగంలో రవిచాన్‌రెడ్డి 50 మీటర్ల ఫ్రీస్టైల్, బెస్ట్ స్ట్రోక్‌లో మొదటి స్థానాల్లో నిలిచి గోల్డ్ మెడల్, 100 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ విభాగంలో రెండో స్థానంలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు.



పతకాలతో కేఎల్‌రావునగర్ స్విమ్మర్లు

రైల్వేస్టేషన్‌లో ‘క్రౌడ్ మేనేజ్‌మెంట్’ చర్యలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):పండుగ సెలవుల్లో విజయవాడ రైల్వేస్టేషన్‌లో నెలకుంటున్న ప్రయాణికుల రద్దీ నివారణకు అధికారులు ప్రత్యేకంగా ‘క్రౌడ్ మేనేజ్‌మెంట్’ చర్యలు చేపట్టారు. ఈ మేరకు స్టేషన్‌లో మీడియా టూర్ ఏర్పాటు చేసి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా డీసీఎం ఎండీ ఆలీఖాన్, స్టేషన్ డైరెక్టర్ శైలజ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీపావళి పండుగ సమయంలో ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రద్దీ నివారణ చర్యలు తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. దీనికి దక్షిణ మధ్య రైల్వే అదనంగా 850 ప్రత్యేక రైళ్లు నడుపుతుండగా అందులో విజయవాడ డివిజన్ నుంచి 40 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెయిటింగ్ లిస్ట్‌లోని ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సౌకర్యవంతంగా చేరుకునేలా కొన్ని రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని ప్రధాన రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు, అదనంగా ఆర్‌పీఎఫ్, టిక్కెట్ చెకింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. స్టేషన్లలో తాగునీరు, పరిశుభ్రతకు చర్యలు, రైళ్ల సమయపాలన సక్రమంగా జరిగేలా ఇన్‌స్పెక్టర్‌లు, అధికారులు షిఫ్ట్ పద్ధతిలో పర్యవేక్షణ, డిమాండ్ మేరకు క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆహార పదార్థాలు సరఫరా చేసేందుకు ఐఆర్‌సీటీసీ అధికారులతో సమన్వయం, స్టేషన్లలో సీసీ కెమేరాలతో నిరంతర పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.



ప్రయాణికుల స్పందన తెలుసుకుంటున్న స్టేషన్ డైరెక్టర్ శైలజ, డీసీఎం ఆలీఖాన్ తదితరులు

వల.. చేపలు ఇలా..



విజయవాడ ప్రకాశం బ్యారేజీ దిగువన మంగళవారం కొందరు మత్స్యకారులు చేపల కోసం నది మధ్యలోకొచ్చి వల వేశారు. అలా వేశారో లేదో ఇలా చేపలు వలలో పడ్డాయి. ఈ దృశ్యాలను ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





రైల్వే హాస్పటల్‌లో స్ట్రోక్‌పై అవగాహన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం విజయవాడ రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో స్ట్రోక్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ స్ట్రోక్‌కు దారి తీసే పరిస్థితులు, దాని నివారణ చర్యలపై రైల్వే లబ్ధిదారులకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. ఆకస్మికంగా స్ట్రోక్ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యాన్ని వివరించారు. మెడ్‌స్టార్ హాస్పటల్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ బి.హేమేశ్వరరావు స్ట్రోక్‌పై వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల్య ఆహారం, మధుమేహం, కొలెస్ట్రాల్ స్థాయి పరీక్షలు చేయించుకుంటూ సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ పరీక్షలు, ఆర్‌బీఎస్, మూత్రపిండాల పనితీరు, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ తీశారు. ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శౌరిబాల

విజయవాడ డివిజన్‌లో రన్ ఫర్ యూనిటీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆధునిక భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి, దేశ సమైక్యతకు కృషిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకుంటు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో ‘రన్ ఫర్ యూనిటీ’ క్యాంపెయిన్ నిర్వహించినట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం రైల్వే స్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం వద్ద పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏడీఆర్‌ఎంలు పి.ఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, పలు బ్రాంచ్ అధికారులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది, భారత్ స్కౌంట్ అండ్ గైడ్స్, స్కూల్ విద్యార్థులతో కలసి క్లాక్ టవర్ నుంచి రన్ ఫర్ యూనిటీ క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు.

–విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రైల్వే ఆడిటోరియంలో రైల్వే అధికారులు, ఉద్యోగులతో విజిలెన్స్ అవగాహనపై సెమినార్ నిర్వహించారు.



రన్ ఫర్ యూనిటీలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

మంచి నిర్ణయాలతో సాధికారత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బాలికలు మంచి నిర్ణయాలతో సాధికారతను సాధించాలని దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు, గైనకాలజిస్ట్ డాక్టర్ వర్షాపాటిల్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఇంటర్నల్ కంప్‌లెన్స్ సెల్ ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ‘యుక్తవయస్సులోని బాలికలకు సాధికారత’పై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని సెల్ కన్వీనర్ డాక్టర్ రమాదేవి నిర్వహించారు.

ఆకతాయిలకు కౌన్సిలింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వెస్ట్ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో కొత్తపేట పోలీసులు సోమవారం అర్ధరాత్రి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బైక్‌పై తిరుగుతూ రోడ్లపై కాలక్షేపం చేసే వారితో పాటు ఆటోల్లో మద్యం తాగే వారిని, నడిరోడ్డుపై పుట్టిన రోజు వేడుకలను నిర్వహించే యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు, కొత్తపేట సీఐ చిన్న కొండలరావు, పోలీసు సిబ్బంది బైక్‌లపై తిరుగుతూ ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీ, టీనర్‌పేట అడ్డరోడ్డు, కేఎల్‌రావునగర్, కొత్తపేట ప్రాంతాల్లో పర్యటించారు. రాత్రి 11 గంటల తర్వాత రోడ్లపై ఎవరూ గుంపులుగా ఉండకూడదని, మరోసారి ఇలాగే వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యం పోలీసులు గస్తీ నిర్వహిస్తే ఇటువంటి సమస్యలు పునరావృతం కావని పలువురు మహిళలు ఏసీపీ దృష్టికి తీసుకొచ్చారు.

బైక్ దొంగకు ఏడు నెలల జైలు, జరిమానా

విజయవాడస్పోర్ట్స్: రైల్వేస్టేషన్‌లో బైక్‌ను దొంగిలించిన వ్యక్తికి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మూడో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నామాల జ్యోతి మంగళవారం తీర్పు చెప్పారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్న వ్యక్తి తన బైక్‌ను స్టేషన్ క్లాక్ టవర్ వద్ద పార్కింగ్ చేసి విధులకు హాజయ్యాడు. విధులు ముగించుకుని వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో బాధితుడు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 8న వెలుగు చూసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటికే గుడివాడలో బైక్‌ను దొంగిలించి అక్కడి పోలీసుల అదుపులో ఉన్న రాజమండ్రి సమీపంలోని కొత్తమర్రు గ్రామానికి చెందిన సన్నాల నాగరాజును పీటీ వారెంట్‌పై అరెస్ట్ చేసి మార్చి 15న కోర్టులో హాజరుపర్చారు. ఏడుగురు సాక్షులను విచారణ చేసిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు నాగరాజుకు జైలు శిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమావతి వాదనలు వినిపించారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పేరెంట్స్, టీచర్స్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ కళాశాలలో చదువుకుంటున్న పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. విద్యార్థుల ప్రగతిపై క్లాస్ టీచర్‌తో మాట్లాడి తమ పిల్లల చదువు ఎలా ఉంది, విద్యా బోధన ఎలా ఉంది, హాజరు శాతం ఎలా ఉంది వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థికి 75 శాతం హాజరు ఉంటేనే అమ్మకు వందనం పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.

అలరించిన నృత్య రూపకాలు





కోట్లాది మంది భక్తులు కొలిచే శ్రీవేంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ ప్రముఖ వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన పద సంకీర్తనలతో కళాకారిణులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం మెప్మా ఆధ్వర్యాన జరిగిన ఒక కార్యక్రమంలో నగరానికి చెందిన నాట్యాచారిణి అనూష నాయుడి దర్శకత్వంలో ఆమె శిష్య బృందం చేసిన నృత్య రూపకం కనువిందు చేసింది. స్వయం సహాయక సంఘాల మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు పలువురిని ఆకర్షించాయి. మంత్రి నారాయణ ప్రశంసించారు. కళాక్షేత్రం ప్రాంగణంలోని స్ట్రీట్ వెండర్స్ ఫుడ్ ఫెస్ట్‌ను మంత్రి నారాయణ ఆసక్తిగా తిలకించారు.

–భవానీపురం(విజయవాడపశ్చిమ)

నందీశ్వరునికి రుద్రాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో త్రయోదశని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. విశేష పుష్పాలంకరణ, పంచహారతులు చేశారు. కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు రాచకొండ సుమంత్‌శర్మ, నాగరాజుశర్మ నిర్వహించారు.

